# అందని లోతులు

రాత్రి సెకండ్ షో చూసిరావటం మూలాన్న ప్రొద్దుట ఎనిమిదయిందన్నా లేవలేక ప్రక్కమీద దొర్లుతున్నాను. మా రాధ అన్నం వార్చుకుంటూ విసుక్కొంటోంది. ఇహ లేవకపోతే సహస్ర నామార్చన మొదలెట్టుందేమో నన్న భయంతో బ్రష్‌మీద వేపగింజంత పేస్టు అంటించుకుని రేడియో సిలోన్ ట్యూన్ చేసి దొడ్లో అరుగుమీద బైఠా యించాను. బాదంచెట్టుమీద కాకులు తెగ అరుస్తున్నాయి. ఆ అరుపులికి మా లేగదూడ బెదిరి గంతులు వేస్తోంది. దాని మెళ్ళో గంటల గణగణలో మా "లతా" కంఠస్వరం విన్పిం చక నాకు చిరాకు ఎత్తింది.

"రాధా, ఆ దూడని కట్టేసి ఆ కాకి మూకమీద ఒక బెడ్డేయి!" అన్నా. రాధ వెంటనే దూడను కట్టేసి కాకులను అదిలించింది. మా పెళ్ళయిన ఆరేళ్ళలోనూ ఇదే మొదటిసారి అది నే చెప్పిన పని వెంటనే చేయటం. అందుకు దానికి ఏదన్నా ప్రయిజ్ ఇద్దామనిపించింది; నాలుగు పూవులు విరిసి వున్న నందివర్ధనం రెమ్మ తుంచి వంటింట్లో కెళ్ళి

"రాధా! నీ కో ఆపరేషన్‌కి నా కృతజ్ఞతగా ఈ పుష్ప గుచ్ఛము గైకొమ్మని భవదీయ భక్తాంఘ్రిరేణువు ప్రార్థన" అన్నాను. రాధ మౌనంగా ఆ పూవులు తీసి రాగి పళ్ళెంలో పడేసి "కాఫీ పుచ్చుకోండి" అన్నది.

"కాఫీకేంగాని నీ ప్రసన్నతకు కారణంబొండు కలదేని వివరింపుము మాచిత్త మిగురొత్తంగగా భామా!" అన్నాను. రాధ విచారంగా ముఖం పెట్టింది. ఆ నల్లని కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయ్. నేను హడలిపోయాను. ఏ దేవతయినా ఫూనుతోందేమిటి చెప్మా, రాత్రి సినిమాకి తీసుకవెళ్ళలేదని" అని ఆలోచనలో పడ్డాను.

"నాగమణి చచ్చిపోయిందట!" పమిటచెంగుతో కళ్లు వత్తుకోసాగింది.

"నాగమణీ! నాగమణీ!" అన్నాను. నా గుండెల్లో సన్నగా మంట బయల్దేరింది. త్రాగుతోన్న కాఫీ నోటికి చేదయింది.

"ఎల్లా చచ్చిపోయింది? నిజంగా చచ్చిపోయిందా రాధా? నీ కెవరు చెప్పారు?" వంటింట్లో గడపమీద కూలబడ్డాను. పప్పు ఎసరు తెర్లి పొయ్యిలో పడి మంటని చల్లార్చింది. వెంటనే వంటిల్లంతా పొగ క్రమ్మేసింది. ఆ పొగలో ఉక్కిరి బిక్కిరయిపోతూంటే, మణి కథ నా తలలో తిరగసాగింది.

మేము రామచంద్రపురంలో కాపురం పెట్టిన మర్నాటి ప్రొద్దున్న మా ఇంటివారమ్మాయి స్నేహలత మా వాటాలోకి వచ్చింది. నేను స్టవ్‌మీద నీళ్ళు పడేసి నూతి దగ్గర స్నానం చేస్తున్నాను.

"ఏమండీ రెండు చెంచాలు కాఫీ గుండ ఇవ్వండి" అంది గోడతో అన్నట్లు. నాకు వళ్ళు మండింది. నిన్న దిగామో లేదో అప్పుడే ఆరంభమా? అయినకాడికి బోలెడంత అద్దెపోస్తూ పైగా అప్పులుకూడా ఇవ్వాలా?"

"నేనింకా బజారుకు పోయి కావల్సిన సరుకులు పట్టా లేదు అమ్మాయ్. కాస్త స్థిమితపడిన తర్వాత మీకా్కావాల్సిన బియ్యం, పంచదార, నెయ్యి, నూనె, పప్పులు పట్టు కెళ్లొచ్చు" అన్నాను. ఆ అమ్మాయేం చిన్నబుచ్చుకోలేదు. పైగా బల్లచెక్కమీదున్న బ్రూక్ బాండ్ డబ్బా తీసి రెండు చెంచాలు కాఫీ పౌడరు పొట్లాం కట్టుకొని, రెండు చెంచాలు పౌడరు స్టవ్ మీద తెర్లుతూన్న నీళ్ళల్లో వేసి, గిన్నె క్రిందకు దింపి నీళ్ళు జల్లి చక్కా బోయింది. నేను విస్తుపోయాను. సాయంత్రానికి మా శ్రీమతి రానే వచ్చింది. ఇంక అది మొదలు ఇద్దరూ మా ఇంట్లోనో, వాళ్ళింట్లోనో తప్ప విడిగా ఒకరోజూ కనబడేవారు కాదు. ఒక్క క్షణం అయినా విడిచి వుండలేని స్నేహితురాళ్ళయిపోయారు. స్నేహలత సరదాగా మాట్లాడేది. చలాకీగా తిరిగేది. కాని స్నేహం అంటే నాకు సదభిప్రాయం వుండేది కాదు. మా శ్రీమతివల్ల తప్పనిసరిగా ఆమె రాకపోకలను భరించాల్సి వచ్చేది. స్నేహలత చంటిపిల్ల కాదు. ఇరవయి ఏళ్ళు దాటాయ్. వాళ్ళింట్లో ఆమె చంటి పిల్ల అవటంనించి అందరూ బాగా ముద్దుచేసేవారు. స్నేహలత కింకా పెళ్ళి కాలేదు. ఎన్నో సంబంధాలు చూశారు. ఒక్కటీ ఆ అమ్మాయికి నచ్చేదికాదు. ఖర్మంచాలక స్నేహానికి నచ్చితే వాళ్ళమ్మా నాన్నలకి నచ్చేదికాదు. అందుకని ఏదో వంకని ఆ సంబంధాన్ని త్రోసిపుచ్చేవారు. ఆ అమ్మాయి మూతిముడుచుకొని కూర్చునేది. అప్పుడు నాక్కూడా జాలేసేది. ఈ సంబంధాలు చూస్తూండగానే ఈ అమ్మాయికి

ఇరవయి ఏళ్ళు దాటిపోయాయే! ఇంకెలా చేస్తారు పెళ్ళి? అసలు వాళ్ళింట్లో అందరికీ నచ్చిన వరుడంటూ ఎక్కడన్నా పుట్టి పెరిగాడా లేదా?" అనిపించేది. వాళ్ళకి మట్టుకు చీమ కుట్టినట్లు అనిపించేది కాదనుకుంటాను. అలా ఓడాని తర్వాత ఇంకొకటిగా సంబంధాలు చూస్తూనే వుండేవారు. ఈఅమ్మాయి మటుకు శుభ్రంగా ముప్ఫయ్యేసి రూపాయల చీరెలు కట్టూ వచ్చిన ప్రతి సినిమా చూస్తూ, తనకి పెళ్ళవలేదని బెంగెట్టుకునేది. స్నేహలతది అదొక విధమైన మనస్తత్వము. వాళ్ళింట్లో వాళ్ళందరూ ఆ అమ్మాయంటే శ్రద్ధాసక్తులు చూపించేవారు. ఆ అమ్మాయికి అందరూ తనేదో మహా విపత్తులో వున్నట్లు ఓదార్చాలనిపించేది కాబోలు. అస్తమానమూ ఏవేవో కష్టాలు వల్లిస్తూ కూర్చునేది. కష్టాలంటే మరేం లేదు. పెళ్ళి కాకపోవటమే పెద్ద కష్టం! ఎవరైనా "నీకేం లోటు స్నేహం! నీకన్నీ లక్షణంగా జరుగుతాయి. దిగులుపడకు" అన్నారనుకోండి. వాళ్ళకి తను సుఖంగా వుంటున్నదనే 'ఈర్ష్య' అని దుయ్యపట్టేది. నాగమణి స్నేహలత స్నేహితురాలుట! ఇద్దరూ ఎప్పుడో ఇత్తూకుల బార సాలనాడు చదువుకున్నారుట! స్నేహం ఎప్పుడూ నాగమణిని వెంటేసుకు తిరిగేది. స్నేహలత పదివేలు పోసి భర్తను కొనుక్కోగల సమర్థురాలు! నాగమణి మారుచీర కొనుక్కోలేని సమర్థురాలు! స్నేహలత మాట్లాడుతోంటే వడగళ్ళవానలా వుండేది! నాగమణి పలుకులు సన్నటి పన్నీటిజల్లు! ఆమె సన్నగావుండేది. ఆమె ముఖంలో ఏదో నిర్వచించలేని

కాంతివుండేది. నీరసంగావున్నట్లు నడిచేది. ఆ అమ్మాయి అప్పుడప్పుడు స్నేహలతతో మా ఇంటికివచ్చేది. రాను రాను ఆ అమ్మాయిమీద నాకు "క్యూరియాసిటీ" ఏర్పడింది. ఆమె నా మనస్సంతా 'పీయూషం' నింపుతున్నట్లు తలపోసేవాణ్ని. ఆమె నామోచ్ఛారణలో నాకేదో ప్రశాంతతా, తృప్తీ లభ్యమయ్యేవి. ఆఫీసునించి ఇంటికిరాగానే నా కళ్లు స్నేహం ప్రక్కన వెతుకులాడేవి. వాళ్ళున్నంతసేపూ నేనెందుకని, రోడ్డమ్మట తిరిగి బాగా పదయ్యేక ఇల్లుచేరేవాణ్ని. స్నేహ లత అటువచ్చి యిటువచ్చి నాతో హుషారుగానే మాట్లా డేది. నాగమణి మట్టుకు పెదవికదల్చకుండా బిడియంగా కూర్చునేది. మరీ నవ్వొచ్చే సంభాషణొచ్చినప్పుడు ఆమె బుగ్గలు మడతపడేలా నవ్వుకునేది. ఆ చంపల ఎరుపుదనం మా రాధ పెదిమల గులాబీరేకలని వెక్కిరించేదా? అని పించేదినాకు.

"మణినికూడా రోజూ రమ్మనకూడదూ మనింటికి? మరేంలేదు—ఆ అమ్మాయినిచూసైనా నువ్వూ, స్నేహం నోరు తగ్గిస్తారనీ" అన్నానొకసారి. మా రాధ నాకేసి విచి త్రంగాచూసింది.

రోహిణీకార్తె మిట్టమధ్యాహ్నము రెండింటికి నేను 'వివిధ భారతి' రికార్డ్సు వింటూ కిటికీలోంచి రోడ్డుమీదకు చూస్తూ కూర్చున్నాను. మా శ్రీమతి పచ్చగాపండిన బంగినపల్లి మామిడిపళ్లు చెక్కుతీసి ముక్కలుచేస్తోంది. ఆ మిట మిటలాడే ఎర్రని ఎండలో కాళ్లకు చెప్పులులేకుండా మణి

మండే ఇసుకలో, కరకర చప్పుడు అవుతోంటే నడుచుకు పోతోంది.

"రాధా ? మణి ఎక్కడికో వెళ్తోంది. ఆ అమ్మాయిని పిలిచి రెండుపళ్లు ఇయ్యకూడదూ ?" అన్నాను. మా రైతు ఇరవయి మామిడిపళ్లు తేనెపాకం పట్టుకొచ్చాడు ప్రొద్దుట.

"ఆ అమ్మాయి ఏం పనిమీద వెళ్తుందో పిలిస్తే వస్తుందా."

"ఇంత ఎండపడి వెళ్తున్నది. నీడలోకిరమ్మంటే ఎందుకురాదూ ? చల్లగా కాస్త తేనెపాకం చేసిస్తే ఎందుకు పుచ్చుకోదూ ?"

"మణికి మొగమాటం ఎక్కువండీ. నేను రెండు మూడుసార్లు ఫలహారం పెట్టితే ఆ పిల్ల తినలా. అయినా రోజు రోజుకీ మీకా పిల్లమీద ఆపేక్ష ఎక్కువయిపోతోందే" అంది, మామిడిపళ్ళ ముక్కలున్న పింగాణీ ప్లేటు నాకేసి నెట్టుతూను. నేను మాట్లాడలేదు.

ఒకరోజు తీరుబాటుగా బజారువెంపు బయలుదేరాను. బియ్యంకొట్టు దగ్గర నాగమణీ, షావుకారూ ఘర్షణ పడుతున్నారు. నేను సంగతి సందర్భాలు విచారించాను. శేరు బియ్యం కొలిపించుకొని రూపాయి కాగితం ఇచ్చానంటోంది మణి.

"మీరు కాగితం నా చేతికివ్వలేదు. నేను బియ్యం కొలిచి ఇయ్యగానే చిల్లరిమ్మన్నారు. కాగితం ఇమ్మంటే ముందే ఇచ్చేశానంటున్నారు" గట్టిగా అరుస్తున్నాడు షావు

కారు. నాగమణి నన్నుచూసి తలవంచుకుని నెమ్మదిగా జవాబు చెప్తోంది.

"నేను నిన్ను బియ్యం కొలవమని కాటాలో రూపాయి కాగితం పడేశాను. అది తీసుకుని గల్లాపెట్టిలో పడేసుకుని నాకు చిల్లరివ్వకుండా బియ్యం కొలిచావు. కొలిచి పొట్లాం కట్టాక చిల్లర డబ్బు లిస్తావనుకుంటే, అసలు రూపాయే ఇయ్యలేదంటున్నావు." కక్కుర్తికొద్దీ డబ్బులియ్యకుండానే బియ్యం కొలిపించుకుందా? అనే అనుమానంతో ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాను. షావుకారు కక్కుర్తికొద్దీ అలా వాదు వేశాడని ఆ అమాయకమైన చూపులో తట్టింది నాకు. వెంటనే రూపాయి సెట్టి చేతిలో వేసి, ఆతనిచ్చిన పావలా అర్థణా జేబులో వేసుకుంటూ "పదండి" అన్నాను.

"మీరు తొందర పడ్డారు. వాడు రూపాయ నా దగ్గర తీసుకున్నది తెలుసుండీ అబద్ధాలు ఆడుతున్నాడు" అంది.

"నువ్వెన్నిసార్లు నచ్చచెప్పినా వాడు విన్పించుకోకుండా పబ్లిక్‌లో అల్లా అరుస్తోంటే ఎంతకని వొప్పిస్తావు చెప్పు."

"అదీ నిజమే. కాని నాకో బాధ పట్టుకుంది. ఇప్పుడు మీరుకూడా నన్ననుమానిస్తారా? మా స్థితిగతులు ఎవరే మాట అన్నా సరిపోయేటట్లున్నాయి లెండి" అంది.

"నేను అలాగనుకోవటంలేదు నాగమణీ. నువ్వు అనవసరంగా నడి రోడ్డులో నవ్వుల పాలవటం గుర్తించి అల్లాగ

చేశా. నిన్ను గురించి చెడ్డగా ఎన్నడూ తలపోయలేను. అది ఎన్నటికీ నాకు సాధ్యం కాదు.'' ఆమె ఆశ్చర్యంగా నాకేసి చూసింది. మర్నాడు సాయంత్రం నేను ఆఫీసునుంచి ఇంటి కొచ్చేసరికి మా రాధ సత్యభామ అయ్యింది. టేబుల్ మీది పేపర్ వెయిట్ క్రింద రూపాయి కాగితం నన్ను పల్కరిస్తోంది.

"కాఫీ త్వరగాపట్రా. పోవాలి" అన్నాను.

రాధకళ్లు పెద్దవిగా గుండ్రంగాచేసి 'టేబుల్ మీది గ్లాసు కనపట్టంలేదూ ?'' అంది.

"నీ చేత్తో ఇవ్వాలని" నవ్వుతూ అన్నాను. ఏమను కుందోమరి. కాఫీగ్లాసులోకి వొంచిఇచ్చింది. త్రాగేయగానే చెప్పుల్లో కాళ్లేట్టున్నాను.

"ఏం అంతతొందర ? నాగస్వరం విన్పించిందా ?"

"రాధా ?" అన్నాను, ఆగిపోయి కోపంగా.

''ఉన్నమాటలంటే వులుకేమరి ? నేను తెలివితక్కువ మొద్దును. నాకళ్లు ఎప్పుడూ మూసుకునేవుంటాయ్. మీరు నిన్నసాయంకాలం రూపాయి ఇచ్చారుట. బావగారికి ఇమ్మ నమనిచెప్పి వెళ్లింది. మీ మరదలు మణి. వెళ్లండి, పాపం. ఎక్కడో దారికాసివుంటుంది కాబోలు !" నాకు నిజంగా విచారంకలిగింది. మా రాధ ఇంతలా దిగజారుతుందని నేనూ హించని విషయం.

రాధా ? నన్ను నువ్వింతే అర్థంచేసుకున్నా వన్నమాట. నిన్న నేను మణికి రూపాయి ఇచ్చినమాట కాదనటంలేదు. కాని ఏ పరిసితిలో ఇచ్చానో ఆలోచించలేకపోయావు. అది

నీతో చెప్పకపోవటం నాపొరపాటు. నిన్న పాపం మణిని బియ్యం షావుకారు దాని రూపాయి కాజేసి ఇయ్యలేదని బుకాయిస్తోంటే జాలేసి ఇచ్చాను."

"మీ పొరపాటు కాదు. నాగ్రహపాటు. జాలిట. జాలి. గుడ్డివాళ్ళనీ, కుంటివాళ్లనీ, ముసలివాళ్లనీ చూసినప్పుడు యీ దయాంతఃకరణ ఎక్కడ దాక్కుంటుందేం దొరగారూ ?" విస విసా బయటికివచ్చేసాను. రాధ చిత్తపరిధి చాలా చిన్నదని గ్రహించాను. అందులోనే ఆలోచిస్తుంటుంది. దానితో పిడివాదం వేసే ఓర్పు నాకులేదు. నా మనస్సులో మసకగా మణిరూపం మెదలసాగింది. రాధ చేసినసవాలు నిజమేననిపించింది. ఇంతవరకు నాకు మణి "ఫామిలీ" వివరాలు తెలీవు. నాకై నేను తెలుసుకో ప్రయత్నించలేదు. ఆమె చెప్పనూ లేదు.

ఒకరోజు సాయంత్రం నేను మామూలుగానే "తిరువీథ్యుత్సవమున"కు బయలుదేరాను. రెండు సందులు తిరిగి మూడో వీథిలో కడుగు పెట్టేసరికి ఆ వీథిలో పాతబడిన పెంకు టింటిముందు జనం గుంపుగా వున్నారు. ఆ జనం ఏదో "ఎంటర్‌టయిన్‌మెంటు" చూస్తున్నట్లు లోపలికి చూస్తూ వాళ్ళల్లో వాళ్ళు గుసగుస లాడుతున్నారు. నేను మరొకప్పుడైనా అలాంటి జనసందోహంలో జరిగే రభస తెలుసుకోవాలన్న కుతూహలం కనపరచను. కాని ఆ రోజు నేను ఆ జనం మధ్యకు ఎందుకు వెళ్ళేనో నా కిప్పటికీ అవగాహన అవటం లేదు. నన్ను ఏదో బలవత్తరమయిన శక్తి ఆవహించి ముందుకు

త్రోసింది. నా వేషం చూసి జనం దారి ఇచ్చారు. లోపల మండువాలో ఒక నడికారు మనిషి ఒక సాధారణమయిన "స్త్రీ"ని తిట్టుతూ చావబాదుతున్నాడు. ఆమె ముఖంలో కన్నీళ్ళు లేవు. ముక్కులోంచి కొద్దిగా రక్తం కారుతున్నది. అయినా ఆమె మౌనంగా దెబ్బలు భరిస్తూంది. దూరంగా గోడకు చారబడి నాగమణి నిశ్చేష్టురాలుగా నిలబడింది. నేనెందుకలా తెగించానో? నాకు, వాళ్ళకు మధ్య అనుబంధం ఏమిటో?

"చాల్లేవయ్యా! చాలించు. ఇంక కట్టిపెట్టు నీ పౌరుషం. చంపేస్తే పోలీసు లూరుకుంటారనుకున్నావా?" మధ్యకి వెళ్ళి అడ్డుపడ్డాను. జనమంతా నేనేదో ద్విపాద పశువయినట్లు నాకేసి వింతగా చూట్టం మొదలెట్టారు. ఆ పెద్దమనిషి ఏమనుకున్నాడో నాకేసి తీక్ష్ణంగా చూసి బయట కెళ్ళిపోయాడు. ఆ స్త్రీ పెరట్లోకెళ్ళి ముఖం కడుక్కుని మండువాలో క్రొవ్వొత్తి వెలిగించి నుదుట కుంకుమ దిద్దుకుంది. నాగమణి ముఖం రెండుచేతులతోనూ కప్పుకుంది. నేను దగ్గరగావెళ్ళి;

"నువ్వుకూడా. ముఖం కడుక్కో-మణీ" అన్నాను. ఆమె ముఖంమీది చేతులు తీయలేదు తన బ్రతుకు బట్టబయలు అయిందన్న 'నిర్వేదంతో' ఆమె కుంచించుకు పోతోందని నాకు తెలుసు.

"బాధపడకు మణీ, లేచిన వేళావిశేషం" అన్నా నాకు మనస్సులో ఆమెను అనునయించాలని కోరిక. కాని అనుకున్న

భావానికి భాష లభ్యమవటంలేదు. ఆమె కళ్ళువిప్పి చూసింది. నాకు ఆవేదన కలిగింది.

"మణీ ఎవ్వరాయన? ఎందుకా దారుణ హింసా కాండ? అంతా అలా చూస్తారు కాని ఒక్కళ్ళు అడ్డువచ్చి మిమ్మల్ని ఆదుకోరేం?" ఇంటి కప్పుమీంచి బూజు చుట్టు కున్న బల్లివచ్చి నా నెత్తిమీద పడింది

"మీ కెందుకుబాబూ మాగోడవ? అన్నీ అడిగి దాన్ని వేధిస్తారెందుకు? మా తిప్పలు మేం పడతాం. పెద్ద అడగొస్తారు కాని ఆర్చేవారా తీర్చేవారా? మాదగ్గర్నుంచి అన్నీ అడిగి రేపు వాళ్లతో జమఅవుతారు" దూకుడుగా అన్నది, ఆస్త్రీ. బయటజనం అందరూ ఎవరిళ్ళకు వాళ్ళు సర్దుకున్నారు.

"అందర్నీ ఒకదారానికే గుచ్చేస్తున్నారు మీరు. బహుశా వాళ్ళవల్ల మీరుపొందిన అనమానాలతో మీకు లోకంఅంతా శంకించే పరిస్థితి ఏర్పడింది. నేను అందరి లాంటివాణ్ణి కానని ఎలానిరూపించుకోవాలో నాకే తెలియటం లేదు. క్షమించండి." నాగమణి ముఖమంతా కళ్ళుచేసుకుని నా వెంపుచూసింది. నేను బయటకి వచ్చేస్తూంటే నా వెను కగా వచ్చింది.

"అక్క ఆలాఅన్నందుకు ఏం అనుకోకండి. ఆమె శరీరం లోకం మాటలచేత, మా బావ దెబ్బలచేత తూట్లు పడిపోయింది. ఆమె జీవితానికి శాంతిలేదు. నేనో దానికి గుదిబండలా తయారయ్యాను." ఆమె చెంపలమీద కన్నీళ్ళు

జారాయ్. నాకున్న అవకాశాల్లో మణికి చేయూత ఇవ్వటానికి ఏం దారి కన్పించటంలేదు. వీరుడులా మధ్యకి వెళ్ళాను కాని నా సమర్థత ఏంచేస్తే నిరూపితమవుతుందో బోధపడటంలేదు ! నాగమణికి చెల్లాయమ్మ సవితి అక్కట. నాగమణి స్కూల్ ఫయినల్ చదివింది. ఆమె అక్కదగ్గరే వుంటుంది. చెల్లాయమ్మకు నాగమణిఅంటే పంచప్రాణాలు. ఆమెభర్తకు మణంటే కిట్టదు. ఆతనికి "బ్రాకెట్లు," బార్‌కి వెళ్లడం మొదలయిన వుత్తమపురుష లక్షణాలన్నీ వున్నయ్. వాళ్ళిల్లు మండువా పద్ధతిలోవున్న పురాతన కొంప. అది చెల్లాయమ్మకీ నాగమణికి చెరిసగం వాటావస్తుంది. అది మరామత్తుల్లేక పెచ్చులూడిపోయి వుంటుంది. గచ్చుకూడా పూర్తిగాపోయి శిథిలావస్థలోవుంటుంది. దానిమీద రెండు మూడు వేల రూపాయలు చెల్లాయమ్మ సంతకంక్రింద తణఖా తెచ్చి వాడేశాడు. చెల్లాయమ్మభర్త. అతనికి చేతిలోడబ్బు అయిపోయినప్పుడల్లా చెల్లాయమ్మని పట్టుకు చావబాది చేతికి అందిన సొమ్ములు పట్టుకపోయి అమ్మేస్తాడు. డబ్బు కరారావుడి అయినాక మళ్లీ తయారవుతాడు. ఈసారి నాగమణిని కూడా సంతకం పెట్టమని అప్పు తెచ్చాడుట. దానికి చెల్లాయమ్మ ఎదురుతిరిగిందట.

"ఇప్పుడు నాకేందారి కన్పించటంలేదు. రోజు రోజుకీ మా బావ పరిస్థితి విషమించిపోతోంది. అది ఎందుకో నాకు తెలుసు. మా అక్క వంటిమీద సొమ్ములు అయిపోయినాయ్. నాసంతకంలేనిదే ఇంటిమీద అప్పుపుట్టదు.

నా వాటామీదకూడా అప్పుచేస్తే నిలువనీడ వుండదని మా అక్క భయం. ఆ డబ్బుతోనైనా నాకు పెళ్ళిచేస్తే సరి పోతుంది అని అక్కకు ఆశ. నేను దానికి ఏం అనటంలేదు. మా బావ ఎప్పుడు దేనిమీద సంతకంపెట్టమన్నా పెట్టేస్తా ఏమంటే మా అక్కకోసం. అది దెబ్బలుతినకుండావుంటే చాలు. అది నామీద చూపుతున్నదయకి ఆమాత్రం కృతజ్ఞత చూపకపోతే ఇక మనిషిజన్మ ఎందుకూ? డబ్బు ప్రాణాలని పోస్తుందా చెప్పండి. మా అక్కకి హిస్టీరియా కూడా వుంది. మా అక్కలేకపోతే ఇంకనాకు ప్రపంచంలో ఎవ్వరూలేనట్లే. ఎల్లాగో అల్లా మా అక్క నాలుగు కాలాలుపాటు చల్లగా వుండాలి" చెల్లాయమ్మ సన్నగా పూచిక పుల్లలా వుంటుంది.

"అంతా భగవదనుగ్రహం మణీ! మీ అక్కకేమైనా ఆపదవస్తే నేను లేనూ?" ఆమె చెంపలమీద తడిసిన జుట్టుని చెవిపైకి మృదువుగా సవరించాను.

కొన్ని రోజులదాకా నేనూ, మణీ కలుసుకోవడం పడలేదు. ఈ లోపల మా రాధ విపరీతంగా మారిపోయింది. ఆమె దయనీయమైన చరిత్ర స్నేహం ద్వారా తెలుసుకుని చాలా విచారించింది. ఆ అమ్మాయంటే చెప్పలేని ఆపేక్ష నింపుకుంది కాబోలు.

"నువు నాగమణిని జేరనియ్యకు రాధా! మొదట్లో ఏదో అనుకున్నాకాని వాళ్ళ "బాక్గ్రౌండ్" అంత గణ నీయమైనది కాదట!"

"అల్లా అనుకోకండీ. ఆ అమ్మాయి చాలా మంచిది. వాళ్ళక్క నేనంటే ఎంతో ప్రాణం యిస్తుంది. కూటికి నీరసం అయితే అవొచ్చును. గుణానికి నీరసులు కారు" అన్నది రాధ.

"హతోస్మి!" అనుకున్నాను. నాగమణి విషయం ఇంకెప్పుడూ రాధ దగ్గర ఎత్తలేదు. నాకు ఆ సాహసం లేక పోయింది.

నాగమణికి రాధతో బాగా చనువయ్యింది. ఒక విషయం రాధతో చెప్పి ఏడ్చిందట. వాళ్ళక్క బావ దగ్గర మణి పెళ్ళివిషయం ఎత్తిందట. దానికి ఆయనగారన్నాడుట;

"ఎటూ రోజూ వాళ్ళింటికి తగలడుతోందిగా. ఆరమణ గాడు మూడు ముళ్లూ పడేస్తాడేమొ కనుక్కోమనూ."

"రామ! రామ! అవేం మాటలండీ, అతనికి లక్ష్మి దేవి లాంటి భార్య వుంది."

"అల్లాగా! అయితే ముడేయకుండానే అట్టే పెట్టుకో వచ్చుగా?" చెల్లాయమ్మ ఛర్రు మందిట.

"మీకు నోరెలా వచ్చిందీ అల్లా అనటానికి? ఏదో స్నేహంగా వెళ్తుంటే అతనికోసరం వెళ్తోందనుకున్నారా? ఏమిటి మీ వుద్దేశం?" నిలదీసిందట.

"ఏ ఉద్దేశం లేకుండానే మనింటికొచ్చాడూ వాడు? నన్ను కొట్టటానికి తయారయ్యాడు స్కౌండ్రలు!"

"అల్లా అనకండి. వాళ్ళు వింటే ఎంతో బాధ పడ తారు! "నేను పడటంలేదూ నీతో? అంచేత నా మాట

విను. మనం నలుగురిలోనూ ప్రచారం చేసి వాళ్ళింటికివెళ్తే చచ్చినట్లు ఒప్పుకుంటారు. భార్య వుంటే మాత్రం ? ఇద్దరూ వుంటే తీరిపోయేదానికి." మణి గుండెలు అవిసిపోయాయ్. ఈ ప్రవాహంలో తనూ, అక్కా గడ్డిపోచలు. అన్నంతా చేసి తీరే రకం అతను. అంచేత గత్యంతరం లేక రాధతో చెప్పుక పడ్చింది నాగమణి. ఆ రోజుల్లో నాకు ట్రాన్స్ఫర్ అయ్యే సూచనలొచ్చాయ్. 'అమ్మయ్య' అనుకున్నాను. మా రాధ నాతో అంది :

"ఇక్కడ వూళ్ళోవాళ్ళ వరస ఏం బాగులేదు. అంతా మిమ్మల్నీ, మణినీ గురించి అనుకుంటున్నారు. అంచేత మణి చాలా అధైర్యపడుతోంది. మనం వెళ్ళేటప్పుడు దాన్ని కూడా తీసుకపోదాం. ఏదైనా ఉద్యోగం చేసుకుంటూ హాయిగా వుంటుంది."

నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది. ఈవిడలో ఇంత తెగువ ఎందుకు కలిగింది ? మా రాధ మొదట్లో అన్న మాటలు జ్ఞాపకానికొచ్చాయ్ ! నా శరీరం జలదరించింది. ఒక వరలో రెండు కత్తులు ? నాకు రాధతో సంసారం అసంతృప్తి కలిగించలేదు, రోడ్డున పోయే అమ్మాయి గురించి మాట్లాడితేనే సహించలేకుండా అన్నిమాటలన్నదే ! అలాంటిది నిత్యం నాగమణి సామీప్యం తన్నెలా భరించగలదు ? తనెగిరి గంతేస్తాడేమో, నాలుగూ దులుపుదామన్న సరదా కాదుకదా కొంపదీసి ?

"నీ కేమయినా మతి చలించిందా రాధా? నన్నింత నీచుడిక్రింద జమ చేశావన్నమాట. నువ్విలా మాట్లాడ గలవని నేను కలలోకూడా అనుకోలేదు."

"నేను మిమ్మల్ని బాగా ఎరుగున్నాను. మన మూలంగా ఒక అమ్మాయి జీవితం సమూలంగా నాశనం అవటం చూసి సహించగలిగే శక్తి లేదు. అంచేత ఇంతగా చెప్తున్నాను." భగవాన్, నా కేం దారి? దీని పర్యవసాన మేమిటి? నాగమణికి, రాధకి ఈ రాజీ ఎల్లా జరిగింది? నాగ మణి రాధని ప్రాధేయపడిందా? నాకు నాగమణిమీద చెప్ప లేనంత అసహ్యమేసింది. ఆమె బాధ ఆమె పడేటప్పుడు ఆమెమీద నాకు చెప్పలేనంత జాలీ, ఆపేక్ష. కాని ఇప్పుడు ఆమె బాధ స్వయంగా మామీద రుద్దటానికి ప్రయత్నిస్తుం దేమో అనే వూహ వచ్చేసరికి నాగమణిమీద జుగుప్స కలి గింది. మనం సినిమాల్లో ముష్టివాళ్ళనీ, బాధలు పడేవాళ్ళనీ చూసి కన్నీరు కార్చగలం. అదే ముష్టివాళ్ళు మన గుమ్మంలో నిలబడి చేయిజాపితే మన కష్టార్జితం కానీ ఇవ్వటానికి అసహ్య వడుతూ, వాళ్ళు దుక్కల్లా వుండికూడా డిగ్నిటీ ఆఫ్ లేబరుని గుర్తించకుండా సోమరితనం బలిసి, వుట్టి అరుపులతో మన సొమ్ము దోచుక తింటారని చిన్న లెక్చరివ్వ బుద్ధిపుడుతుంది. బాధలు అయినా అంతే! అవి వుట్టినే వింటానికీ,వుత్తుత్త సాను భూతి చూపటానికీ తప్ప మన రెక్క అసరా వాంఛిస్తే మటుకు వాళ్ళు వట్టి చవట దద్దమ్మలనీ, ఎవ్వరిమీద ఫాయిస్టు చేద్దామా అని గోతిక్రింద నక్కల్లా కాచుక్కూచుంటారనీ అనుపిస్తుందేమో!

"నువ్వీ పిచ్చి వూహాలు మాను రాధీ! నేను వూరెళ్ళి ఇల్లు దొరకగానే ఉత్తరం వ్రాస్తాను. వచ్చేయి. నాగమణిని కనుక తీసుకవస్తే నువ్వుకూడా వచ్చిన దారినే వెళ్ళాల్సిన అవసరం కలుగుతుందనీ గుర్తుంచుకో" నిక్కచ్చిగా చెప్పే శాను. నేను వచ్చేటప్పుడు మణి, 'స్నేహం' మా ఇంట్లోనే వున్నారు. స్నేహలత నేను రిక్షా ఎక్కేదాక ఏమో అంటూనే వున్నది. నాగమణి ఏం మాట్లాడలేదు. మౌనంగా నిలబడింది. మా రాధ ఆమె భుజంమీద చేయివేసి నిల బడింది. రాధకు నామీద బాగా కోపం వచ్చిందేమో! ఇక్కడకు వచ్చిన నెల రోజులదాకా ఏదో తలపోస్తున్నట్లుం డేది. ఇప్పుడిప్పుడే ఆమెలో పూర్వపు చురుకుదనం వస్తోంది.

# 3

"మీలాంటి కఠిన మనస్కుణ్ణి నే నెక్కడ చూళ్ళేదు. మణి మీ మూలానే చచ్చిపోయింది. నిజంగా మీ మూలానే చచ్చిపోయింది. నేను ఆ అమ్మాయిని ఎలాగయినా తప్పించుక తీసుకవచ్చి,ఏదో దారిచూపించాలనుకున్నాను. ఏ ఇన్స్టిట్యూ షన్లోనో జేర్పిద్దామనుకున్నాను. ఏదో విధంగా ఆమె ప్రశాంతంగా బ్రతకటానికి అవకాశం కల్పిద్దామనుకుని ఆరాట పడ్డాను."

"నా కిష్టం లేందే ఏం చేయమంటావు రాధా!" అన్నాను దీనంగా.

"అదే మీ మగాళ్ళతో వచ్చే చిక్కు. ఒక వైపు నించే ఆలోచిస్తారు. మీకు విచక్షణా జ్ఞానం శూన్యం. వాళ్ళ బావ ఏదో అన్నాడని మీరు నన్ను కూడా అపార్థం చేసుకున్నారు. మీరు ఆమె పట్ల మూర్ఖంగా ఆలోచించారు. ఆమెను ఏదో ఆపదలో అడ్డుకునేవాడిలా భ్రమ కల్పించారు. అది భ్రమ అని తేలేసరికి ఆ పిల్ల తట్టుకోలేకపోయింది. మీరు వాళ్ళ 'ఫామిలీ'తో జోక్యం కలుగజేసుకోకుండా వుంటే ఆమె అక్క లేని లోటుని నిబ్బరంగా నిలవరించుకునే శక్తి సంపాదించును. మీ సానుభూతి ఆమె పట్ల ప్రాణాంతకమైంది."

"చెల్లాయమ్మ చనిపోయిందా!" అన్నాను.

"అవును. ఎన్నాళ్ళు దెబ్బలుతో బతుకుతుంది. మనింటికి వెళ్ళమని సలహా ఇచ్చిందట స్నేహం. అదే ఆలోచిస్తున్నాను. రాధంటే నా కాపేక్ష. అది ఎలా తెలియజేయాలో తెలియటం లేదు అందిట. మణి ఉత్తరం వ్రాయి అందిట. స్నేహం "అలాగే" అందిట. నాగమణి ఆమెను ఇంటికి వెళ్ళనిచ్చి నూతిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. మన మూలంగా నాగమణి చచ్చిపోయింది. ఒక అమ్మాయి నూరేళ్ళ జీవితం మన ప్రవర్తన మూలంగా బుగ్గయింది" అని గోల చేయసాగింది రాధ. నా అంతట నేను నాగమణికి సాయం చేస్తే తన అస్తిత్వం దెబ్బతింటుందేమో అనుకుంది

రాధ. నన్ను నొప్పించే మాటలంది. నాగమణి రాధకి సామీప్యమయ్యేసరికి నిజానికి దగ్గరగా వచ్చింది రాధ. నాకు ముందర నాగమణిమీద వాత్సల్యం కలిగిన మాట వాస్తవం. కాని ఆమె రాధని ఆసరా కోరటంతో ఆమెమీది ఆపేక్ష కాస్తా తుడిచిపెట్టుకపోయింది. ఇది నాకే అర్థమవటం లేదు. నాగమణి ఇక ఎవర్నీ సహాయ సానుభూతులకోసరం దేవిరించ నక్కర్లేదు. నాకూ, మా రాధకూ పరస్పరాభిప్రాయాలను కూలంకషంగా చర్చించుకునే స్థిమిత మనస్తత్వములేక నాగమణిని అన్యాయంగా అవకాశం వుండీ కూడా బలిచేసుకొన్నాము. నాగమణి చావు మా రాధమీద ఆపేక్షకు కారణం ఋజువుపర్చింది. నాకు తెలిసినట్లుగా మా రాధకు తెలీదు.